క్లుప్తంగా

వైఎస్సార్ బీమా పంపిణీ

సత్యవేదు: మండలంలోని కొత్తమారి కుప్పం పంచాయతీ నీళ్లతొట్టి కండ్రిగ గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన ఏ. రమేష్(35) కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలను వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కె.చంద్రశేఖర్ రెడ్డి అందజేశారు. ఆయన మాట్లాడుతూ మిగిలిన రూ.90వేలు నామినీ బ్యాంకు ఖాతాకు జమ అవుతుందని తెలిపారు. వెల్‌ఫేర్ అసిస్టెంట్ శామ్యూల్, సర్పంచ్ డి.నాగమ్మ, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సురటుపల్లిలో కృపాలక్ష్మి పూజలు

నాగలాపురం: మండలంలోని సురటుపల్లిలోని ప్రముఖ శ్రీసర్వ మంగళ సమేత పళ్లికొండేశ్వరస్వామి ఆలయాన్ని శుక్రవారం ఉప ముఖ్య మంత్రి నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మి దర్శించుకున్నారు. దేవస్థానం చైర్మన్ ఏవీఎం బాలాజీరెడ్డి దర్శన ఏర్పాట్లు చేసి, తీర్థ ప్రసాదాలను అందించారు.

గంగమ్మ ఆలయానికి భూమి పూజ


భూమి పూజలో పాల్గొన్న గ్రామస్తులు

ఏర్పేడు: మండలంలోని మాధవమాల ఎస్సీ కాలనీలో గంగమ్మ దేవత ఆలయ నిర్మాణానికి గురువారం భూమి పూజ జరిగింది. గ్రామస్తుల విరాళాలతో కాలనీలో ఆలయాన్ని నిర్మించనున్నారు. గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ కరీముల్లా, ఎంపీటీసీ మాజీ సభ్యుడు వెంకటయ్య, నాయకులు నీలకంఠారెడ్డి, భాస్కర్‌రెడ్డి, రవి నాయుడు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు అవార్డు


అవార్డు అందుకుంటున్న రమేష్‌బాబు

శ్రీకాళహస్తి: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు అవార్డు అందుకున్నారు. గురువారం తిరుపతి కచ్చాపి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ ఎన్నిక సాధన అవార్డును కలెక్టర్ వెంకటరమణారెడ్డి నుంచి ఆయన అందుకున్నారు.

భక్తులకు అన్నదానం

శ్రీకాళహస్తి: పౌర్ణమిని పురస్కరించుకుని పట్టణంలోని శ్రీచాముండేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో గురువారం విశేష పూజలు నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఆవరణంలో భక్తులకు అన్నదానం చేశారు. నిర్వాహకులు పులి రామచంద్రయ్య, పీఎం చంద్ర, ఈశ్వరయ్య, కనకయ్య, పులి నాగార్జున, ఎం. ఈశ్వరయ్య, పోతులూరు సోము పాల్గొన్నారు.

నూనె కూజాల సమర్పణ



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానానికి పట్టణానికి చెందిన రమేష్‌రెడ్డి దివిటీలకు నూనె వినియోగించేందుకు రెండు కూజాలను సమర్పించారు. వీటిని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసలురెడ్డి స్వీకరించి దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

ముక్కంటి సేవలో ..

శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని గురువారం మాజీ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ దర్శించుకున్నారు. పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. బీజేపీ నాయకుడు కోలా ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడి మృతిపై చర్యలు తీసుకోవాలి

శ్రీకాళహస్తి: అభం శుభం తెలియని బాలుడి ప్రాణాలు బలిగొన్న శ్రీచైతన్య విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి గురవయ్య డిమాండ్ చేశారు. ఎంఈవో భువనేశ్వరిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. శ్రీచైతన్య స్కూల్ డ్రైవర్‌నిర్లక్ష్యం కారణంగా ఎంఎంసీ కండ్రిగకు చెందిన రెండు సంవత్సరాల బాలుడు హేమాద్రి మృతి చెందిన ఘటనపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు సురేష్, గురుప్రసాద్, శివసాయి, వెంకటాద్రి, కుమార్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

అదనపు భవనాల ప్రారంభం రేపు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో అదనపు భవనాలను శనివారం ప్రారంభించనున్నారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి హాజరు కానున్నట్లు వైఎస్సార్‌సీపీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

ఓటుతోనే దేశ భవిష్యత్



శ్రీకాళహస్తి: విద్యార్థుల అవగాహన ర్యాలీ



వరదయ్యపాళెంలో ..

శ్రీకాళహస్తి: ఓటు హక్కు శక్తివంతమైన ఆయుధమని ప్రిన్సిపల్ రాజశేఖర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని తెలుగుగంగ కాలనీలో ఉన్న ప్రభుత్వ మహిళ డిగ్రీ, పీజీ కళాశాలలో రాజనీతి విభాగాధిపతి సుజాత ఆధ్వర్యంలో ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ రాజశేఖర్ మాట్లాడుతూ ఓటు హక్కు విలువను వివరించారు. దేశ భవిష్యత్‌ను తీర్చి దిద్దగల నాయకులను ఓటు ద్వారానే ఎన్నుకోవచ్చన్నారు. అనంతరం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

సద్వినియోగం చేసుకోవాలి

అర్హులైన వారు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు సుధీర్‌రెడ్డి అన్నారు. తొట్టంబేడులో ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఓటరు ప్రతిజ్ఞ చేశారు. సీనియర్ సిటిజన్లను సన్మానించారు. ప్రిన్సిపల్ సుధాకర్, అధ్యాపకులు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. సీనియర్ సిటిజన్లను సన్మానించారు. ర్యాలీ నిర్వహించారు. అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటు రాజ్యాంగం ఇచ్చిన హక్కు

సత్యవేదు: ఓటు రాజ్యాంగం ఇచ్చిన హక్కుఅని తహసీల్దార్ జరీనా తెలిపారు. గురువారం సత్యవేదులో జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు, మండల అధికారులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. సీనియర్ సిటిజన్లు ఎం.కమలమ్మ, ఎస్ శ్రీనివాసులు, కె.దండపాణిని సన్మానించారు. ఎంపీడీఓ చంద్రశేఖర్‌ఎంఈఓలు కె.రవి, ఉష, డీటీ రవి చంద్ర, ప్రిన్సిపల్ పరందాం పాల్గొన్నారు.


సత్యవేదు: పుదుకుప్పం తమిళ హైస్కూల్లో..

పుదుకుప్పం తమిళ హైస్కూల్లో..

ప్రజాస్వామ్యంలో నేతల తలరాతలను మార్చే శక్తి ఓటు హక్కుకు ఉందని పుదుకుప్పం తమిళ మీడియం హైస్కూలు ప్రధానోపాధ్యాయిని భారతి అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఉపాధ్యాయులు జయంతి, ప్రేమ్‌కుమార్, జగదీష్, శివలింగం, ఆంథోని తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల ప్రతిజ్ఞ

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవం జరిగింది. ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అమరేశ్వర రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

అర్హులు ఓటరుగా నమోదు కావాలి

బుచ్చినాయుడుకండ్రిగ: ఓటు ప్రతి పౌరుడి హక్కని, అర్హులైన ప్రతిఒక్కరు ఓటు హక్కును పొందాలని డిప్యూటీ తహసీల్దారు చంద్రబాబునాయుడు తెలిపారు. గురువారం ఓటర్ల దినోత్సవం సందర్భంగా సీనియర్ మహిళ ఓటర్లను సన్మానించి, ర్యాలీ నిర్వహించారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

నాగలాపురం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. తహసీల్దార్ ప్రసన్న కుమార్, అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రతిజ్ఞ చేశారు. ప్రధానోపాధ్యాయుడు కస్తూరయ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: ఓటు వజ్రాయుధం లాంటిదని, దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుందని వరదయ్యపాళెం హైస్కూల్ హెచ్ఎం రమణయ్య తెలిపారు. ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వేణుగోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




సత్యవేడు: అధికారులు, విద్యార్థుల మానవహారం, ఏర్పేడు: ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, తొట్టంబేడు కళాశాల విద్యార్థుల ప్రతిజ్ఞ





శ్రీకాళహస్తి: రెవెన్యూ అధికారులు, విద్యార్థుల ర్యాలీ, నాగలాపురం: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజా ప్రతి నిధులు, బీఎన్‌కండ్రిగ: విద్యార్థుల ర్యాలీ

జగనన్న పాలనలో అన్ని వర్గాలకు మేలు


సత్యవేడు: సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ గురుమూర్తి

బుచ్చినాయుడుకండ్రిగ/నాగలాపురం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాలకు మేలు జరుగు తుండడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారని తిరుపతి ఎంపీ, వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజక వర్గ సమన్వయ కర్త మద్దిలగురుమూర్తి అన్నారు. ఆయన గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద, నాగలాపురంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను, ఇప్పటి వరకు చేకూరిన లబ్ధిని వివరించాలన్నారు. శనివారం తిరుపతిలోని పీఎల్ఆర్ గ్రాండ్‌లో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధ్యక్షతన నియోజక వర్గ స్థాయి సమావేశం జరుగుతుందని, మండల నాయకులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. వైఎస్సార్ సీపీ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు బీరేంద్రవర్మ, మండల కన్వీనర్ అరణి విద్యానాథ రెడ్డి, ఎంపీపీ సుబ్బలక్ష్మి, సోషల్ మీడియ జిల్లా కన్వీనరు రాకేష్, సురుటుపల్లె దేవస్థానం చైర్మన్ బాలాజీరెడ్డి, రాష్ట్ర నాయకుడు నలుగూరి రమేష్ బాబు, నాయకులు గోపాల్‌రెడ్డి, రవిరెడ్డి, గురునాథం, గురవయ్య, సర్పంచ్ వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు గోపూజా కార్యక్రమంలో ఎంపీ పాల్గొన్నారు. నాగలాపురం కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అపరంజిరాజు, సర్పంచ్ చిన్నదొరై సుధా, ఎంపీపీ సింధు శ్యామ్, జెడ్పీటీసీ సభ్యురాలు సుమతి మహేష్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ మోహన్ మొదలియార్, వైస్ఎంపీపీ ఉదయ్ కుమార్, నాయకులు జగదీష్ రెడ్డి, జేబీ మునిరత్నం, అంకయ్య, దేశప్పన్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.


బీఎన్‌కండ్రిగ: గోపూజ చేస్తున్న ఎంపీ గురుమూర్తి

మెజారిటీని సాధిద్దాం

సత్యవేడు: రానున్న ఎన్నికల్లో సత్యవేడులో వైఎస్సార్ సీపీకి భారీ మెజారిటీ వచ్చేలా పని చేద్దామని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త డాక్టర్ గురుమూర్తి కోరారు. గురువారం సత్యవేడులో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు రఘుపతి రెడ్డి, కె.సుశీల్‌కుమార్ రెడ్డి, కేవీ.నిరంజన్ రెడ్డి, కె చంద్రశేఖర్ రెడ్డి, ఏవీఎం బాలాజీ రెడ్డి, బెల్లు రమేష్, కోఆప్షన్ సభ్యురాలు మస్తానీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం: ప్రజా ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రాంతాల పేదలకు మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నారని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. నారాయణవనం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా సుమారు రూ.52 లక్షలతో నిర్మించిన అదనపు గదులను జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్, ఎంపీపీ దివాకర్ రెడ్డి, అధికారులతో కలిసి ఆయన గురువారం ప్రారంభించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఆయన గదులను, సమావేశ మందిరాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పాలనలో విద్య, ఆరోగ్యం, సంక్షేమానికి జగనన్న ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. మెరుగైన వైద్య సేవల కోసం ప్రతి పీహెచ్‌సీలో అదనంగా మరో డాక్టర్ నియామకం, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌లను ఏర్పాటు చేసి 56 రకాల వైద్య పరీక్షలను, వందకుపైగా మందులను అందుబాటులో ఉంచిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందని తెలిపారు. నాణ్యమైన మందులను పూర్తి స్థాయిలో ప్రభుత్వ ఆస్పత్రులకు, ఉపకేంద్రాలకు అందిస్తోందని అన్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సారకాయలు, జేసీఎస్ కన్వీనర్ కోనేటి బాబు, ఎంపీడీవో కృష్ణమూర్తి, పీహెచ్‌సీ వైద్యులు దర్శిత్ రాజ్, రాగసుధ, మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

యథేచ్ఛగా సారా విక్రయాలు

నాగలాపురం: నాగలాపురం వెస్టు దళితవాడ, చుట్టు పక్కల గ్రామాల్లో కొద్ది రోజులుగా సారా విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఎక్సైజ్ పోలీసు స్టేషన్ ఉన్నప్పటికీ ఈ విక్రయాలు తారస్థాయికి చేరడం పలు అనుమానాలకు తావిస్తోంది. సారాను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా శ్రమిస్తున్నప్పటికీ ఎక్సైజ్ అధికారులు ఉదాశీనంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక మహిళలు గతంలో 100కు ఫోన్ చేసి ఫిర్యాదు కూడా చేశారు. తరువాత కొంతకాలం విక్రయాలు ఆగాయి. మళ్లీ కొద్ది రోజులుగా సారా విక్రయాలు జోరందుకున్నాయి. ఎక్సైజ్ అధికారులు స్పందించి సారా విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

వెన్నెల కాంతుల్లో ఊయలూగిన ఉమాపతి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం పౌర్ణమిని పురస్కరించుకుని ఊంజల్‌సేవ కనుల పండువగా జరిగింది. మొదట ఆలయ అలంకార మండపంలో స్వామి.అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. అనంతరం ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. ఊరేగింపుగా సర్వాంగ సుందరంగా అలంకరించిన ఊంజలసేవ మండపానికి తీసుకువచ్చి ఊయలలో కొలువుదీర్చారు. వేదమంత్రోచ్చారణల నడుమ ఊంజల్ సేవ నేత్రపర్వంగా జరిగింది. వెన్నెల కాంతుల్లో ఊయలలో భక్తులు సేదతీరుతున్న శ్రీస్వామి, అమ్మవార్లను దర్శించి తరించారు. పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.


ఊయలలో సేదతీరుతున్న స్వామి,అమ్మవార్లు

నేడు ఎంపీ గురుమూర్తి పర్యటన

పిచ్చాటూరు: పిచ్చాటూరులో శుక్రవారం వైఎస్సార్ సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త, ఎంపీ గురుమూర్తి పర్యటించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు కేవీ చలపతిరాజు తెలిపారు. ఉదయం 11.30 గంటలకు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జరగనున్న వైఎస్సార్ సీపీ నాయకుల ఆత్మీయ సమావేశంలో ఎంపీ పాల్గొంటారన్నారు. మండలంలోని పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కేవీబీపురం మండలంలో..

కేవీబీపురం: తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శుక్రవారం ఉదయం మండల కేంద్రంలో జరిగే రిపబ్లిక్‌డే వేడుకల్లో పాల్గొననున్నారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గవర్ల కృష్ణయ్య తెలిపారు. అనంతరం 11 గంటలకు పార్టీశ్రేణులతో ఆత్మీయ సమావేశం అవుతారని పేర్కొన్నారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

కొత్త సీఐల బాధ్యతల స్వీకారం


నరసింహారావు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి అర్బన్ సీఐగా ఎస్వీ నరసింహారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టిసారిస్తామని తెలిపారు. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసకుంటామన్నారు.

బీఎన్ కండ్రిగ.. శ్రీహరి


శ్రీహరి

శ్రీకాళహస్తి: బీఎన్ కండ్రిగ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీహరి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పని చేస్తున్న విక్రమ్ ఎన్నికల సాధారణ బదిలీల్లో భాగంగా అనంతపురం జిల్లాకు వెళ్లారు. ఏర్పేడు నుంచి శ్రీహరిని ఇక్కడికి వచ్చారు. సీఐ శ్రీహరి మాట్లాడుతూ అందరి సమన్వయంతో చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణకు కృషి చేస్తామని వివరించారు.

ఏర్పేడు .. శ్రీరామశ్రీనివాసులు


శ్రీరామ శ్రీనివాసులు

ఏర్పేడు: సీఐగా శ్రీరామ శ్రీనివాసులు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీహరి బుచ్చినాయుడుకండ్రిగ సర్కిల్‌కు బదిలీ అయ్యారు. అనంతపురం రేంజ్ వీఆర్ నుంచి ఇక్కడికి శ్రీరామ శ్రీనివాసులు వచ్చారు. ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. శాంతి, భద్రతలను పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. ప్రజలకు అందు బాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

సెమీ ఫైనల్స్‌కు మూడు జట్లు


సెమీఫైనల్‌కు చేరిన సత్యవేడు బాలికల జట్టు

సత్యవేడు: ఆడుదాం.. ఆంధ్ర క్రీడాపోటీల్లో భాగంగా గురువారం బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో మూడు జట్లు సెమీఫైనల్‌కు చేరుకొన్నాయి. కేవీబీపురం, సత్యవేడు, పిచ్చాటూరు జట్లు సెమీ ఫైనల్స్ చేరాయి. తొలుత బ్యాటింగ్ చేసిన నారాయణవనం జట్టు 69 పరుగులకు ఆల్ అవుట్ కాగా, కేవీబీపురం జట్టు 70 పరుగులతో విజయం సాధించింది. అలాగే టాస్ విన్ పొందిన పిచ్చాటూరు బాలికల జట్టు తొలుత బ్యాటింగ్ చేయగా, ఏడు ఓవర్లలో 17 రన్స్ చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన సత్యవేడు బాలికల జట్టు ఓపనర్లు ఇద్దరే 18 రన్స్ చేసి విజయం సాధించి సెమీఫైనల్స్ ఎంపికైయ్యారు.

పిచ్చాటూరు – వరదయ్యపాళెం

తొలత బ్యాటింగ్ చేసిన వరదయ్యపాళెం జట్టు పది ఓవర్లలో 61 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన పిచ్చాటూరు జట్టు క్రీడాకారులు 9ఓవర్లలో 62 పరుగులు చేసి విజయం సాధించారు. అంపైర్లుగా పీడీలు మురళి, అమ్ములు, భాస్కర్, ఢిల్లీ రాణి వ్యవహరించారు.

సకాలంలో పన్నుల వసూలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని బుచ్చినాయుడుకండ్రిగ, కనమనంబేడు గ్రామాల్లోని వలంటీర్లు సకాలంలో ఇంటి పన్నులు వసూలు చేయాలని గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ తెలిపారు. గురువారం గ్రామ సచివాలయంలో ఉపసర్పంచ్ మునిరాజా అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. నగదు రహిత ఇంటి పన్ను వసూలుపై వలంటీర్లకు అవగాహన కల్పించారు. ఉప సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధిలైట్ల నిర్వహణపై దృష్టి పెట్టి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామ తెలిపారు. చెత్తను సంపద కేంద్రాలకు తరలించి ఎరువులు తయారు చేసి ఆదాయం పొందేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

విజేత జట్టుకు క్రికెట్ కిట్



ఏర్పేడు: ఆడుదాం–ఆంధ్రా మండల స్థాయి విజేత జట్టుకు గురువారం ఎంపీడీఓ గిడ్డయ్య క్రికెట్ కిట్ అందజేశారు. బండారుపల్లె సచివాలయ పరిధిలోని మన్నసముద్రం, బండారుపల్లె గ్రామాలకు చెందిన క్రికెట్ జట్టు మండల స్థాయి విజేతగా నిలిచింది. ఈ నెల 27న శ్రీకాళహస్తి ఎస్‌పీవీఏ ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్‌లో ఏర్పేడు, తొట్టంబేడు, శ్రీకాళహస్తి, రేణిగుంట మండలాలకు చెందిన జట్లు మధ్య నియోజక వర్గ స్థాయి పోటీలు జరుగనున్నాయి. ప్రభుత్వం నుంచి వచ్చిన ప్రొఫెషినల్ క్రికెట్ కిట్‌ను అందజేశారు.

సిపాయి భరోసా అందజేత


సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్సీ సుబ్రమణ్యం

ఏర్పేడు: మండలంలోని పల్లంగొల్లపల్లెలో ఆదిశేషమ్మ(49), పాత వీరాపురంలో కొంగర మునిరెడ్డి(52) కుటుంబాలకు గురువారం సిపాయి భరోసా సాయం అందింది. ఆదిశేషమ్మ, మునిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం గురువారం ఆయా గ్రామాలకు వెళ్లి మృతుల కుటుంబ సభ్యుల సిపాయి భరోసా కింద ఏడాదికి సరిపడే 41 రకాల నిత్యావసర సరకులను అందజేశారు.

పైపులైన్ పనులకు భూమిపూజ


పవిత్రారెడ్డికి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం గురప్పనాయుడు కండ్రిగ ఎస్సీకాలనీలో తాగునీటి పైపులైన్ ఏర్పాటు పనులకు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె బియ్యపు పవిత్రారెడ్డి గురువారం భూమిపూజ చేశారు. కాలనీవాసుల వినతి మేరకు పైపులైన్ ఏర్పాటుకు ఎమ్మెల్యే రూ.6 లక్షలు మంజూరు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉన్నం వాసుదేవనాయుడు, ఉప సర్పంచ్ సుమతి తదితరులు పాల్గొన్నారు.

ఆటో సహా రేషన్ బియ్యం స్వాధీనం



నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి చెక్‌పోస్టు వద్ద బుధవారం రాత్రి ఆటోలో తమిళనాడు నుంచి ఆంధ్రకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఆటో డ్రైవర్‌ని విచారించగా నగరి తరలిస్తున్నట్లు తెలిసింది. ఆటోను పోలీసు స్టేషన్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.